ఎదురుగాలి

"కొత్త బిచ్చగాడు పొద్దెరగడు" అంది సుహాసిని. మూర్తి తలెత్తి చూశాడు. సుహాసిని పెదవులు బిగబట్టి చిరునవ్వు దొంతరలు దొర్లిపోకుండా ఆపింది. ఆమె చొరవకి మూర్తికి ఆశ్చర్యం కలిగింది. ఏమనాలో వెంటనే అతనికి తోచలేదు. సుహాసిని చేతిగడియారం వైపు చూసుకుంది. మూర్తి కూడా యాంత్రికంగా చూశాడు. అయిదు దాటింది.

"అప్పుడే అయిదయిందే!"

"అప్పుడే! ఎప్పుడు అయిదవుతుందా అని ఇక్కడ అందరూ కాచుకు కూచుంటారండీ."

మూర్తి నవ్వాడు. ఆఫీసు తలుపులు వేస్తున్న చప్పుడు వినిపించింది. చప్పుడు విని అతను లేచి నుంచున్నాడు.

"ఫైల్స్ తిరగేస్తుంటే టైం తెలియలేదు." అన్నాడు సుహాసిని వైపు క్షమాపణకోరుకుంటున్నట్లుగా చూసి హాంగర్ కి తగిలించిన కోటు అందుకుంటూ.

"అంత నిజాయితీగా పనిలో లీనమై పోవటం కూడదండీ" అంది సుహాసిని విలువైన సలహా ఇస్తున్న ధోరణిలో.

"లీనం కాకుండా పనిచేసేదెలా?"

"ఆఫీసర్లు పైపైన పెత్తనం చలాయించాలిగాని తమంతట తాము అలా వంచిన తలెత్తకుండా పనిచెయ్య కూడదు" మూర్తి నవ్వాడు.

"నేర్చు కొంటాన్లేండి."

"నేర్చు కోండి" అని మూర్తి బల్లమీద కాగితాలు డ్రాయర్ లోతోసేస్తూ అతనికళ్ళలోకి చాలుగా చూసి డ్రాయర్ మూసి నడుంచుట్టూ పైటకొంగు లాక్కొని వెనక్కితిరిగింది సుహాసిని. గుమ్మందాకా వెళ్ళి ఓసారి వెనక్కిచూసి 'ప్రమోషన్ రాకపోతే మాత్రం నన్నడగొద్దండోయ్" అంది సమాధానంగా మూర్తి చిన్నగా నవ్వాడు. ఆమె వెళ్ళిపోయింది. మూర్తి కూడా వెళ్ళటానికి సిద్ధపడి పెల్స్ తాళం వేసి ఆఫీసు బయటకి వచ్చాడు. సుహాసిని సంభాషణ అతనికి కొంచెం ఆశ్చర్యం కలిగించింది. తను ఆఫీసరు అయితే తనొక్కడే ఆఫీసుకంతటికీ అధికారి కాదు. తనలాంటివాళ్లు కనీసం అర డజనుమంది ఉన్నారు. వాళ్ళందరికీ ఎంతో కొంత సర్వీసు ఉంది. తను కొత్తగా వచ్చాడు. సుహాసినికీ తనకీ అంతకిముందు

గానీ, ఆ రోజునగానీ పరిచయమేమీ లేదు. ఆమె స్టెనో. ఆ రోజు మొత్తంమీద ఆమెతో ఒక్కసారే మాట్లాడాడు.

"ఉత్తరాలున్నాయా సార్!" అడిగిందామె.

తనింకా ఫైల్సు సరిగా చూడలేదు. అదే రోజు ఉద్యోగంలో చేరాడు. ఏది ఏమిటో ఇంకా అంతుబట్టలేదు. మూడు నెలలు ట్రైనింగులో ఉన్నాడు. ట్రైనింగు కాగానే ఆ ఆఫీసులో పోస్టింగు వేశారు. ఛార్జి తీసుకుని విషయాలు అవగాహన చేసుకోటానికి ప్రయత్నిస్తూ.

"లేవు" అన్నాడు ముక్తసరిగా—

ఆమె వెళ్ళిపోయింది. మళ్ళీ సాయంత్రం ఎంతో చనువున్నట్టుగా పలకరించింది. స్టెనోకి అంత చనువివ్వటం మంచిది కాదు. అయినా తను ఎందుకో ఆమెతో సరదాగానే మాట్లాడాడు. ఆఫీసు టైంలో మాత్రం ఆమెతో ముభావంగా ఆఫీసర్ హోదాలోనే మాట్లాడాలని తీర్మానించుకున్నాడు మూర్తి.

వరండాలోకి రాగానే ప్రకాశం కనిపించి 'విష్' చేశాడు. ఆ ఆఫీసులో ఒక శాఖకి ప్రకాశం అధికారి. "చాలా అలిసిపోయినట్టున్నావే!" అన్నాడతను.

"కొత్తగదా!" అన్నాడు మూర్తి.

ప్రకాశం సిగరెట్ కేస్ తీసి మూర్తికి సిగరెట్ అందించాడు.

"అలవాటు లేదండీ" అన్నాడు మూర్తి.

"అలవాటు చేసుకోవచ్చుగా" అన్నాడు ప్రకాశం సిగరెట్ వెలిగిస్తూ.

"అవసరం లేని అలవాటెందుకు?"

"సాంఘికమర్యాదల కోసం."

"అంటే?"

"మీరు వూరికే వుంటే నేను సిగరెట్ తాగుతూ మాట్లాడటం బాగుండదు."

మూర్తి కొంచెం వింతగా చూశాడు.

"మీరలా అనుకోవద్దు" అని మాత్రం అన్నాడు.

"కొంతమందికి ఏం చేసినా చెడిపోతామని భయం" ఆ మాటలు తనని ఉద్దేశించి అన్నవేనని మూర్తికి తెలుసు.

"వ్యక్తిత్వం లేని వాళ్ళకి" అన్నాడతను.

"అంటే?"

"చిన్నప్పటినుంచీ పెద్దలు ఏవేవో నీతులు నూరి పోస్తారు. ముక్కుకు సూటిగా పోతూ, వాటిని గురించి చర్చించకుండా, గుడ్డిగా నీతిపాఠాన్ని వల్లెవేసే వాళ్ళు చెడి పోతున్నామనే భయంతో బిక్కు బిక్కు మంటూ చివరికి చెడిపోతూనే ఉంటారు."

"అందుకేనా మీరు సిగరెట్ తాగనిది?" అన్నాడు ప్రకాశం కొంచెం వెగటుగా నవ్వి.

ప్రకాశం అలా అంటాడని మూర్తి అనుకోలేదు అతని వైపు కొంచెం చిరాకుగా చూశాడు. కాని ఎవరితోనూ పేచీ పెట్టుకోటం అతని కిష్టంలేదు. అందువల్ల లేనినవ్వు తెచ్చు కుని అన్నాడు.

"పోనీ అలాగే అనుకోండి."

ప్రకాశం కూడా నవ్వాడు.

"మైడియర్ మూర్తిగారూ, మీకంటే నాకు ఈ ఆఫీసులోగాని, ప్రపంచంలోగానీ, కనీసం ఐదారేళ్ళ అనుభవం ఎక్కువ. అందుకని సలహా చెబుతున్నాను. ప్రపంచం అనశ్వరం. టేస్ట్ ఎవెరిథింగ్. ప్రతిది రుచి చూడండి. ఇది శాశ్వతం!" అన్నాడు భౌతిక తత్వం జీర్ణించిన వేదాంతిలా.

ఈ సలహాని మూర్తి చాల చాలా తేలిగ్గా తీసుకుని "థాంక్స్" అన్నాడు.

"మంచి సలహా కాదా?" అన్నాడు ప్రకాశం.

"కాకేం! కానీ హోటలు భోజనం రుచి చూసిం తరువాత మరేదీ రుచిచూడ బుద్ధిపుట్టటం లేదు." ఇద్దరూ నవ్వారు.

ప్రకాశంకి ఏదో వెంటనే స్ఫురించినట్టయి "ఇంతకీ మీ మకాం ఎక్కడ?" అన్నాడు.

"హోటల్లోనే, ఏదైనా ఇల్లు చూసుకోవాలి."

"సరిసరి. చెప్పారు కాదు. ముందు వెంటనే మా ఇంటికి బసమార్చండి. ప్రస్తుతం ఒంటరిగానే ఉంటున్నానండి. ఏమీ యిబ్బందిలేదు. తాపీగా ఇల్లు వెదుకుదాం" అన్నాడు ప్రకాశం ఆపద్బాంధవుడిలా.

మూర్తి కూడా ఇంచు మించు వెంటనే ఒప్పుకున్నాడు; ముఖ్యంగా తోడుకోసం. ఇద్దరూ సరాసరి హోటల్ కెళ్ళి మూర్తి సామాన్లు ప్రకాశం ఇంటికి చేరవేశాడు. ప్రకాశం ఇల్లు బాగావసతిగానే ఉంది. మాట కొంచెం కటువైనా ప్రకాశం స్నేహపాత్రుడేననిపించింది మూర్తికి. కొత్తవూళ్ళో వెంటనే ఒక స్నేహితుని సంపాదించుకున్నందుకు సంతోషించాడు.

సామాన్లు సర్దటం అయింతరువాత ఇద్దరూ క్లబ్బుకి వెళ్ళారు. అక్కడ చాలామందితో మూర్తికి పరిచయంకలిగింది. అందులో కొందరు తమ ఆఫీసులోనే సమాన హోదాలో పని చేస్తున్నాడు. ఈ కాసేపటిలోనే ప్రకాశం తనకెన్నోసార్లు సిగరెట్టివ్వబోవటం, మళ్ళీ తన జ్ఞప్తికి తెచ్చుకుని "సారీ, మీరు స్మోక్ చెయ్యరు కదా!" అని కించపడటం జరిగింది. పోనీ అతని తృప్తి కోసం సిగరెట్ తీసుకుందామని మూర్తి అనుకుని కూడా తన నియమం జ్ఞప్తికి తెచ్చుకుని వెనక్కి జంకాడు.

మర్నాడుఉదయం ఆఫీసుకి వెళ్ళినప్పుడు మొట్టమొదట సుహాసిని కనిపించి నమస్కారం చేసింది. ప్రతి నమస్కారం చేశాడు మూర్తి. ఆమె సుతారంగా ఏదో బల్లమీద సర్దినట్టు అభినయించి క్రీగంట చూసి నెమ్మదిగా వెళ్ళిపోయింది. ఏమీ మాట్లాడలేదు. అంతవరకు అదృష్టమేననుకున్నాడు మూర్తి. ఒకగంట గడిచిం తరవాత మళ్ళీ వచ్చిందామె.

"ఏమైనా డిక్టేట్ చేస్తారా సార్?"

మూర్తికి ఒళ్ళుమండింది.

"అవసరమైతే పిలిపిస్తాను కదా!" అన్నాడు కొంచెం విసుగ్గా ఆఫీసరు హోదా ఉట్టి పడేలా.

ఆమె పోబోయి, మళ్ళీ ఆగి "సారీ డిస్టర్బ చేశానా, సార్!" అంది పశ్చాత్తాప పడ్డట్టుగా.

మూర్తి తలెత్తి చూశాడు. సుహాసిని వదనం చిన్నబోవటం గమనించాడు. కొంచెం జాలి వేసింది.

"లేదు లెండి" అన్నాడు.

"ఏదైనా చెప్పండి ఏం తోచడం లేదు." ఈసారి అతనికి బాగా కోపం వచ్చింది.

"ఇది ఆఫీసుగదా, కబుర్లు ఎలా చెప్పేది" అన్నాడు కర్కశంగా.

"కబుర్లు కాదండీ, పని" అంది.

ఈసారి మూర్తి నాలుక కరుచుకున్నాడు. తొందర పడి అపార్థం చేసుకున్నాడు తను.

"పనేం లేదా?" అన్నాడు తన తప్పుని కప్పిపుచ్చు కుంటానికి రెట్టిస్తూ.

"లేదండీ! నేను ఏరోజుపని ఆరోజే పూర్తిచేస్తాను" అందామె అతనికి పనిచేయటం. పని ఇవ్వటం చేతకాద న్నట్టు ధ్వనిస్తూ. ఆ ధ్వనిని గ్రహించి కోపంగా ఒక ఫైలు ఆమె ముందుకి తోస్తూ "ఇది టైపు చేసి తీసుకురండి" అన్నాడు. ఆమె ఫైలు పేజీలు తిరగేసి కొంచెం ఆశ్చర్యంగా "ఇవన్నీనా?" అంది.

"అవును" అన్నాడు కసిగా.

ఆమె వేళ్ళు చూసుకుంది. మారుమాట్లాడకుండా ఫైలు తీసుకుంది. బరువుగా అక్కడినించి కదిలి కొంతదూరం వెళ్ళి అలిగినట్టుగా ఆయన వైపు వెనక్కి తిరిగి చూసింది. ఆమె వెళ్ళినవైపే చూస్తున్న అతనికి గుండె కరిగింది. పిలిచాడు. మాట్లాడకుండా సంజ్ఞచేసి ఆ ఫైలు తీసుకున్నాడు. ఆమెవైపు చూడకుండానే "అవసరమైతే పిలుస్తాను, వెళ్ళండి" అన్నాడు. సుహాసిని నిరుత్తరంగా అతనివైపొకసారి చూసి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళగానే చిరాకుపడ్డాడు మూర్తి.

ఎందుకామె అలా మాపులు విసరటం, కోపం వచ్చిందతనికి. కాని వెంటనే జాలి పడ్డాడు. ఆమెలో కొంత అర్థంకాని అమాయకత్వం ఉంది. తను ఏదైనామాట తూలితే, పాపం చాల బాధపడుతుంది అనుకున్నాడు. ఆమెతో మాట్లాడే టప్పుడు జాగ్రత్తగా ఉండాలని తీర్మానించుకున్నాడు.

సుహాసిని వెళ్ళిన కొద్ది నిముషాలకే శ్రీపతి, ప్రకాశం వచ్చారు. శ్రీపతి ఆఫీసులోనే మరొక శాఖకు అధిపతి. ప్రకాశం అతనిని మూర్తికి పరిచయంచేసి, ఏదో పని ఉందని వెళ్ళిపోయాడు. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడారు.

"ఫూల్‌చంద్ వచ్చాడా మీ దగ్గరకు?" అన్నాడు శ్రీపతి అకస్మాత్తుగా, యధాలాపంగా అన్నట్టు.

"ఫూల్‌చంద్ ఎవరూ" అన్నాడు అర్థంకాక.

"మిల్లు యజమానండీ! రాలేదన్నమాట"

"నా దగ్గ కెవరూ రాలేదు. ఏమిటీ పని?"

"ఆ! నిన్న నా దగ్గరకు వచ్చాడు లెండి. మీరింకా అతనికి పరిచయం కాలేదు కదా! పరిచయం చెయ్యమన్నాడు. ఎందుకయ్యా, ఈ మాత్రందానికి నువ్వే వెళ్ళి అడిగితే పోతూంది అన్నాను."

"ఏం కావాలి?" అన్నాడు ఉపోద్ఘాతం ఎందుకో తెలియక.

"పర్మిట్. మరేంకావాలి అతనికి. ఏదో చూసి పంపండి. బాగా ఉన్నవాడే. బాగానే ఛార్జి చెయ్యవచ్చు."

"ఛార్జి చెయ్యడమేమిటి."

శ్రీపతి అపనమ్మకంతో అతని కళ్ళల్లోకి చూచాడు.

"ఏమిటండీ అల్లా మాట్లాడుతారు! రోజుకి మూడు నాలుగొందలకు తక్కువ కాకుండా వచ్చే సీటులో కూర్చుని..." అన్నాడు మందలించే స్వరంతో శ్రీపతి.

ఈసారి అపనమ్మకంతో చూడటం మూర్తి వంతయింది.

"లంచమా?" అన్నాడు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి.

"ప్రతిఫలం" అన్నాడు అదేం మాట అన్న ధోరణిలో శ్రీపతి.

"ఛీ" అన్నాడు ఏవగింపుతో.

శ్రీపతి కొంచెం చిన్నబోయాడు.

"కబుర్లు చెప్పకండి. ఎవరికీ ఏమీ నష్టంలేని పనిచేసి, అందుకు ప్రతిఫలం తీసుకుంటే ఏమిటి చెబర? జీవితం సాగాలా, వద్దా? మడిగట్టుకు కూర్చోవాలంటే కుదరదండీ మూర్తిగారూ!"

చిన్న ఉపన్యాసం యిచ్చాడు శ్రీపతి.

"అలాంటి పని నేను చెయ్యనండి" అన్నాడు నిష్కర్షగా.

"మీ ఒక్కరూ నీతిగా వుంటే ఏమవుతూంది? ఆమాట కొస్తే నీతి అనేదేమిటో నిర్వచించండి. చాలీ చాలక జీతాలిచ్చి హోదాకు తగ్గట్టుగా బతకమంటే ఎలా? కుటుంబం ఏం కావాలి. రేపు మన పిల్లలు చదువుకోడానికి డబ్బులేక అవస్థపడుతూ, ఏ బండచాకిరీనో చేసుకుని బ్రతుకుతూంటే

నీతి పేరు చెప్పుకుని మనం సంతోషిస్తూ కూర్చోవాలా! కబుర్లు చెప్పకండి!" అన్నాడు శ్రీపతి ఉద్రేకంగా.

మూర్తి ఏమీ మాట్లాడలేదు. యింకా మాట్లాడినా ఉపన్యాసం మరింత పొడుగవుతుందేమోనని అతనికి తెలుసు. శ్రీపతి సమాధానంకోసం కొంచెంసేపాగి, విసుగుదలసూచించే స్వరంతో అన్నాడు.

"చెప్పాలిసింది చెప్పాను, మీ యిష్టం."

అప్పటికీ మూర్తి ఏమీ అనలేదు. శ్రీపతి అహం కొంచెం దెబ్బతింది. వెళ్ళిపోయాడు. ఈవిషయం యింతటితో సరి అనుకున్నాడు మూర్తి. కానీ తను పొరపడ్డట్లు ఆ సాయంత్రమే తెలుసుకున్నాడు. శ్రీపతి ఆ ఫూల్‌చంద్ అనే ఆయన తోసహా తన బసకు వచ్చాడు. వాళ్ళిద్దరినీ చూడగానే మూర్తికి మొదట కోపమూ, తరవాత ఏహ్యాభావమూ కలిగాయి. మర్యాదకోసం యిద్దరినీ ఆహ్వానించి కూర్చోబెట్టాడు. శ్రీపతి మళ్ళీ విషయం కదలేశాడు. ఫూల్‌చంద్ మధ్య మధ్య రేటు పెంచుతూ కలుగ జేసుకున్నాడు. దాంతో మూర్తికి అపరిమితమయిన అసహ్యం కలిగింది. కానీ తమాయించుకున్నాడు.

మూర్తి మొండిపట్టుదల చూసి ఫూల్‌చంద్‌ను వెళ్ళమన్నట్లుగా సంజ్ఞచేశాడు శ్రీపతి. ఫూల్‌చంద్ మూర్తిని మళ్ళీ ఒకసారి ప్రార్థించి, సెలవు తీసుకున్నాడు.

"ఆఫీసు విషయాలు మీకు బాగా తెలియవు." అన్నాడు శ్రీపతి.

ముభావంగా వూరుకున్నాడు మూర్తి.

"మహేంద్రరావూ, రామదాసూ, నారాయణకూడా మొదట యిల్లాగే అన్నారు. రాను రాను కుటుంబభారం మీద పడటంతో తెలిసి వచ్చింది. మీ శ్రేయస్సుకోరి చెబుతున్నాను లేకపోతే ఇలా మీ యింటికికూడా వచ్చి నచ్చచెప్ప అవసరం నా కేమిటి? ఆలోచించుకోండి?" అని శ్రీపతి వెళ్ళి పోయాడు.

మూర్తి కి తల దిమ్మెక్కింది. శ్రీపతిమీద కోపంతో పాటు అసహ్యం కూడా కలిగింది. కాని కొంచెం ఆలోచించే సరికి అతనిమీద అసహ్యం తగ్గింది. తోటి ఉద్యోగి కనుక, అతనికి తోచింది చెప్పాడు. ఆలోచించి కర్తవ్యం నిర్ణయించుకో వలసింది తను. ఇలా అనుకుని, మనస్సు సరిపెట్టు న్నాడు. ఇంతలో ప్రకాశం వచ్చాడు

వచ్చీ రాగానే కుర్చీలోంచి ఏదో తీసి పరీక్షించి మూర్తి వైపు గిరవాటు వేసి అడిగాడు.

"ఏమిటిది?"

"నోట్లకట్ట."

మూర్తి దిగ్భ్రాంతుడయ్యాడు. ఏమిటి? దొంగపని? ఎందు కీ బలవతం?

"ఆ శ్రీపతీ, ఫూల్‌చందూ కలిసి చేసిన పని. రేపు పొద్దున్న వాళ్ళ మొహాలమీద కొట్టి వస్తాను." అన్నాడు మూర్తి ఉద్రేకంగా.

ప్రకాశం నవ్వాడు.

"పిచ్చివాడా! సిరి రా మొకాలొడ్డటం అంటే ఇదే!"

మూర్తి తల పట్టుకున్నాడు.

"మీకు పుణ్యం వుంటుంది. ఆ డబ్బు తీసుకోమని నాకు చెప్పవద్దు" అన్నాడు.

"పోనీ నేను తీసుకోనా?" అన్నాడు ప్రకాశం వెటకారంగా.

వెయ్యి ముఖాలు తనని వెక్కిరిస్తున్నట్టు అనుభూతి పొందాడు మూర్తి. అదే క్షణంలో శ్రీపతి మళ్ళీ వచ్చాడు.

"ఫూల్‌చంద్ డబ్బు యిక్కడమరిచిపోయి వెళ్ళాడుట! ఇప్పుడే కనుపించి చెప్పాడు. మీదగ్గర ఉంచండి. అంత అక్కర లేకపోతే రేపివ్వొచ్చు." అన్నాడు.

"అక్కర్లేదు. క్షమించి యిప్పుడే తీసుకు వెళ్ళండి." అన్నాడుమూర్తి. శ్రీపతి డబ్బుతీసుకుని మరేమి అనకుండా విసురుగా వెళ్ళిపోయాడు.

"నేను లంచం తీసుకోకపోతే ఆయనకెందుకు కోపం?" అన్నాడు మూర్తి.

"మీరు సిగరెట్ త్రాగకపోతే నాకెందుకు కోపం?" అన్నాడు హాస్యధోరణిలో ప్రకాశం. మూర్తి మాట్లాడకపోయే సరికి అతని కోపం తగ్గించడానికి మళ్ళీ ప్రకాశం అన్నాడు.

శ్రీపతిమీద అంత కోపం దేనికి "

ఆయనమీద కాదు, ఆయన చేసిన పనిమీద."

"ఆయన చేసిన పని మంచిది కాదా."

"ముమ్మాటికీ కాదు."

"ఎందుకు కాదు."

"మీకు తెలుసు."

"మీకు తెలిసినట్లుగా నాకు తెలియక పోవచ్చు. ఆ మాటకొస్తే ఆవిషయము ఒకరికి తెలిసినట్లుగా మరొకరికి తెలియదు. మన అభిరుచులకు అనుగుణంగా అభిప్రాయాలు ఏర్పడుతూ వుంటాయి. ఆదృష్టికోణంలోంచి ఇతరుల చేష్టలను విమర్శించటం మంచిది కాదేమో. అలాఅని లంచం తీసుకోవటం సమర్థిస్తున్నానని కాదు. నిజానికి నేను లంచం యింతవరకు పట్టి ఎరుగను. శ్రీపతి సర్వవిధాలా చెప్పాడు. అయితే, నేనతన్ని అందుకు నిందించలేదు: అతనిమీద కోపమూ లేదు."

మూర్తి ప్రశాంతంగా విని వూరుకున్నాడు. అదే క్షణంలో రామదాసు వచ్చాడు. వస్తూనే ప్రకాశం మీద అభాండం వేశాడు.

"నీ క్లబ్బు వ్యసనం మూర్తికి కూడా అంటించావా."

"రామరామ." అన్నాడు ప్రకాశం.

"సంతోషం." అన్నాడు రామదాసు.

"రాములవారి గుడికేనా ప్రయాణం." అన్నాడు ప్రకాశం.

"కాదు క్లబ్బుకి" అన్నాడు వెటకారంగా రామదాసు.

“కూర్చోండి, రామదాసుగారూ!” అన్నాడు మూర్తి తేరుకుని.

“మూర్తిగారూ! ఇవాళ మీరు క్లబ్బు మానేయాలి. అలా వూరిబయటకు షికారు వెళ్దాం” అన్నాడు రామదాసు.

“గుళ్లోకి వెళ్ళొద్దామని చెప్పరాదూ? డొంకతిరుగుడు దేనికి?” అన్నాడు ప్రకాశం.

“ఏం గుళ్ళోకి వెడితే పాపమా?” అన్నాడు రామదాసు.

“రామదాసు! ఆ మాట నేనన్నానా!”

“మరయితే, పదండి, ఆలస్యమెందుకు?”

“నన్ను విడిచిపెట్టండి, క్లబ్బులో పదిమంది పెట్టు నే నొక్కడినీ, గోల పెడతారు” అన్నాడు ప్రకాశం.

“సరే మీ యిష్టం. రండి మూర్తిగారూ అలా వాటర్ వర్క్సదాకా వెళ్ళొద్దాం” అన్నాడు రామదాసు.

నిజానికి మూర్తికి క్లబ్బు మొహం మొత్తింది. ప్రకాశం బలవంతంమీద వెళ్ళటమేకానీ, అందులో అతనికి ఆసక్తి లేదు. అంగువల్ల రామదాసుతో బయల్దేరాడు. రామదాసు అసలుపేరు రామచంద్రరావు. కానీ ఆఫీసులో అందరూ అతన్ని రామదాసుగా మార్చేశారు.

వాటర్ వర్క్స చెరువులదగ్గర కాసేపు కూర్చుని సంజ వేళ యింటికి వెళ్ళారు యిద్దరూ. దారిలోనే గుడి. అందాకా

వచ్చి లోపలకు వెళదామా అన్నాడు రామదాసు. సరే నన్నాడు మూర్తి. రామదాసు రెండు కొబ్బరికాయలు కొనబోయాడు.

"ఒకటి చాల్లెండీ" అన్నాడు మూర్తి.

అదేం? మీరు కొట్టరా?" అన్నాడు రామదాసు కొంచెం ఆశ్చర్యంగా.

"ఎందుకులెండి?" అన్నాడు.

"మీకు భక్తి లేదా?"

"ఆ విషయాలు అడక్కండి."

"ఎందుకు?"

"వాటినిగురించి నేనంత ఎక్కువగా ఆలోచించలేదు."

"ఆలోచించవలసిన విషయాలు అంతకంటే ఏం ఉన్నాయండి?"

"ఎందుకు లేవు బోలెడన్ని ఈతి బాధలు."

"వాటినిగురించి ఆలోచించేదేమిటి. ఎప్పుడేది అవసరమైతే అప్పటి కప్పుడు ఏదో చేసెయ్యటమే."

అయితే ఆలోచించకుండానే ఈ మహానుభావుడు లంచం తీసుకుంటున్నాడా? అనుకున్నాడు. వెంటనే అతనికి రామదాసుమీద కొంచెం అసహ్యం కూడా కలిగింది. జనంలో తిరుగుతూ జనాన్ని మోసగించే ఈయనకి భక్తిలో అంత విశ్వాసం ఎందుకో? చేసిన పాపాల్ని దేవుడు క్షమి

స్తాడనా? ఈ ఆలోచన బాగానే రామదాసుని దెబ్బకొట్టాలని పించింది.

"చేసిన పాపాలకి ప్రతిసాయంత్రం లెక్క చెప్పి శిక్ష తగ్గించటానికి లంచం ఇవ్వటమేగా, కొబ్బరికాయ కొట్టట మంటే" అన్నాడు.

రామదాసు అప్రతిభు డయాడు. అతని ముఖంలోని మార్పుని గమనించి మూర్తికూడా పశ్చాత్తాప పడ్డాడు. అంత కటువుగా అనాలని అనలేదు తను. కాని సమయం మించి పోయింది; అనేశాడు.

"ఈ మాటలు మీ కే తోచాయా? ఎవరైనా చెప్పారా."

"ఒకరు చెప్పేందుకేముంది లెండిఇందులో!" అన్నాడు సర్దుకుంటూ.

"అదికాదు. మీరు చెప్పింది కొందరిపట్ల నిజం కావచ్చు కాని అందరూ అలాంటివారుకాదు. కనీసం నేనలా ఎప్పుడూ అనుకోలేదు. నేనూ పాపాలు చేశాను. ఎవరి గొంతుక కొయ్యక పాపా లనబడేవి చేసాను. ఆ మాట కొస్తే పాపం, ఏదో విధమైన పాపం చెయ్యనిదెవరు. కాని వాటికి ప్రాయశ్చిత్తం కోసం నేను గుడికి రావటంలేదు. మనిషి జీవితం బహుముఖమైంది కదా. అధ్యాత్మిక చింతన కోసం నేను దైవాన్ని ఆరాధిస్తాను. మీరు దేవుడున్నాడని ఒప్పుకోరా."

రామదాసు మాటల్లోని నిజం అవగతమైనా అతను

మామూలు ప్రశ్న ఒకటి వేసేసరికి అతనిలోని తార్కికశక్తిని రెచ్చగొట్టినట్టయింది.

"అయితే ఒప్పుకుంటారన్నమాట."

"ఒప్పుకుంటానని చెప్పలేదే" విస్తుపోయాడు రామదాసు.

"అయితే మీరనేదేమిటి?"

"ఏమీలేదు. నాకీ విషయాలు తెలియవని చెప్పాను. దేవుడున్నాడని నాకు రుజువైతే ఒప్పుకుంటాను. రుజువు కాకపోతే తటస్థంగా ఉంటాను" అన్నాడు.

"మీరు రోజూ నాతో గుడికి వస్తానని మాట ఇవ్వండి." అన్నాడు రామదాసు హఠాత్తుగా.

"ఎందుకు"

"మాటివ్వండి."

"క్షమించాలి."

"మీ మేలు కోరే చెబుతున్నాను."

"కృతజ్ఞుణ్ణి."

"సంశయాత్మా వినశ్యతి."

"కానివ్వండి ఏం చేస్తాం."

"మీకోసం నేను ఇవ్వాళనించీ రోజూ ఒక అరగంట దైవాన్ని ప్రార్థిస్తాను."

"మూర్తి చలించాడు. రామదాసు రెండు కొబ్బరికాయలు కొని గుళ్ళోకి మూర్తితోసహా వెళ్ళాడు. రెండు

కొబ్బరికాయలూ తనతరఫున మూర్తితరఫునా తనే కొట్టాడు. నమస్కారం చేశాడు. మూర్తిని చెయ్యమన్నాడు.

"మీకు నమస్కారం చేస్తానుగాని ఎవరో ఊహించుకున్న బొమ్మకి నమస్కారం చేస్తే ఏం లాభం?" అన్నాడు మూర్తి. రామదాసు వూరుకున్నాడు.

"రోజూ నాతో గుడికి వస్తారు కదూ?" గుడి ప్రాంగణం దాటుతూ అన్నాడు రామదాసు.

"రాకూడదని నాకేమీ లేదు. రావాలనీ లేదు."

"పోనీ ఇలా షికారుగా వద్దాం. ఇష్టమైతే గుళ్ళోకి వెళ్ళవచ్చు. లేకపోతే లేదు."

మూర్తికి నవ్వువచ్చింది. ఈ మనిషికెందుకింత తాపత్రయం? చూస్తే తనని ఈ భక్తిమార్గాన పట్టించేదాకా వదిలేట్టు లేదు. ఏవో సాకులుచెప్పి వదిలించుకోవాలని నిశ్చయించుకున్నాడు మూర్తి.

ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. హోటల్ నించి కారియర్ వచ్చివుంది. ప్రకాశం అప్పటికే భోజనం ముగించుకుని ఉన్నాడు.

"ఏం ఇవాళ అప్పుడే క్లబ్బునించి వచ్చేశారు."

"పౌర్ణమి కదూ! అలా వూరి బయటికి కులాసాగా షికారుకి వెళ్ళొద్దాం త్వరగా భోజనం కానివ్వండి."

మూర్తి తన గదిలోకి వెళ్ళి భోజనం ముగించుకుని బయటకు వచ్చేసరికి ప్రకాశం తెల్లటి గ్లాస్కో-పంచె, గ్లాస్కో-లాల్చీ వేసుకుని కిల్లీ నములుతూ, పూలరంగడిలా కనుపించాడు.

"షికారుకా, అత్తవారింటికా?" అన్నాడు మూర్తి నవ్వుతూ.

ప్రకాశం మాట్లాడలేదు. చిన్నగా నవ్వాడు. ఇద్దరూ వెన్నెల్లో నడుస్తూ వూరి బయటకు చేరుకున్నారు.

"ఇటు కొంతదూరం పోతే ఏరు వస్తుంది." అన్నాడు ప్రకాశం.

"పోదామా?" అన్నాడు మూర్తి ఉత్సాహంగా.

"ఎందుకు? ఏముంటుంది అక్కడ?" అన్నాడు ప్రకాశం చిరునవ్వుతో.

"వెన్నెల్లో ఏరు పొంగి పొర్లుతూంటే చూడ ముచ్చటగా వుంటుంది కదూ!"

"యవ్వనం లా!" అన్నాడు ప్రకాశం.

"బాగా పోల్చారు."

"పోల్చటంలో ఏముంది? అనుభవించాలి."

మూర్తికి ప్రకాశం ఉద్దేశ్యం బోధపడక మాట్లాడకుండా ఊరుకున్నాడు.

"నేను బాగా పోల్చానని ఎందుకన్నారు?"

"ఉపమానం సరిపోయిందని నా భావం."

"యవ్వనం ఉరకలు వేసేవారికది స్వానుభవం. విచ్చల విడిగా సంచరించే ఏరుని ఇప్పుడు మీ రర్థం చేసుకోగలరు కదూ?"

మూర్తి కరధమయింది.

"గట్లను ఒరుసుకునేకదా ఏరుప్రవహించేది" అన్నాడు నర్మగర్భితంగా.

"ఉత్సాహపు వెల్లువలో గట్లుదాటిపోదా ప్రవాహం?"

"గట్లకు లోబడి ఉరకలు వేసేటప్పుడే ఏటి అందం. విలయంలో అంద మేమిటి?"

ప్రకాశం ఒక్క క్షణం వూరుకున్నాడు.

"మీకు వెన్నెల గురించీ, అందాన్ని గురించీ తెలుసు కోవాలని లేదా?" ఉంటే అన్వేషించండి. మనస్సుని ఊరికే అడ్డుప్రశ్నలతో బాధిస్తే, మిగిలేది తలనొప్పే."

మూర్తికి జవాబేమివ్వాలో తెలీలేదు. ఆలోచిస్తూ నడవసాగాడు. ప్రకాశానికి అసంతృప్తిగా వుంది. మూర్తి ఎంత సేపటికీ నీతినిగురించి మాట్లాడుతున్నాడు. అతనికీ చిరాకు వేసింది.

"మీ రెప్పుడూ నీతిసరిహద్దులు దాటలేదు కాబోలు".

"లేదు." అన్నాడు మూర్తి దృఢంగా, గర్వంగా.

ప్రకాశం అసంతృప్తి మరీ ఎక్కువయింది.

"మీకు అవకాశం దొరకలేదు అంతే."

"అవకాశంలో ఏముంది. మనసులో ఉంటుంది" అన్నాడు చాలా తేలిగ్గా మూర్తి.

ప్రకాశానికి రోషం కలిగింది.

"మీలో రసికత లేదు. జీవితం అనుభవించటం మీకు చేత కాదు."

మూర్తి మొహం ఎర్రబడటం ఆ వెన్నెల్లో స్పష్టంగా చూచాడు ప్రకాశం. అతన్ని రెచ్చకొట్టాలనే అలా అన్నాడు. ఫలితానికి సంతృప్తి చెందాడు.

"గాడితప్పని జీవితం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే సరాసరి ఏటిగట్టుకి వెళ్ళండి."

"ఎందుకూ?"

"అవకాశాన్ని ఎదుర్కోటానికి."

"ఏమిటి మీ భావం?"

"అక్కడికి సుహాసిని వస్తుంది."

నెత్తిమీద పిడుగు పడ్డటయింది మూర్తికి. ఒకనిముషం దాకా తేరుకోలేక పోయాడు.

"సుహాసిని!" అన్నాడు తనలో తాను అనుకుంటున్నట్టు.

"అవును. మీ స్నేహితురాలు స్టెనో."

"ఆమె ఎందుకు వస్తుంది?"

"పౌర్ణమినాటి రాత్రి ఏటిగట్టున విహారం చెయ్యటం ఈ వూళ్ళో అత్యాశ్చర్యకరమయిన విషయం కాదు."

"ఆమె వస్తుందని మీ కెలా తెలుసు?"

"తెలియకపోతే ఎందుకు చెబుతాను? ఆమె సంగతి నాకు బాగా తెలుసు. ఆఫీసులోని ఇంకా యిద్దరు ముగ్గురు స్టెనోగ్రాఫుల విషయంకూడా నాకు బాగా తెలుసు." అన్నాడు ప్రకాశం దృఢంగా, ఈసడింపు వ్యక్తంచేస్తూ.

నిజంగా షాక్ తగిలినట్లయింది మూర్తికి.

"అయితే, నేను వెళ్ళడం దేనికి?"

ఈ సారి ప్రకాశం చాలా ఎబ్బెట్టుగా నవ్వాడు. తనని ప్రకాశం అనవసరంగా అనుమానిస్తున్నాడేమోనని బాధ పడ్డాడు.

"మీరు వస్తున్నారని ఆమెకు తెలియదు. నేను వస్తున్నానని తెలుసు. అంతే మరేం లేదు. మాటల సందర్భంలో పౌర్ణమినాటి రాత్రి ఏటి గట్టుకి వెళ్ళటం రివాజు అని ఆమె అంది. నాక్కూడా రివాజేనని చెప్పాను. ఒకవేళ మీరు ఆమె కనిపిస్తే నేను రాలేదేమని అడిగితే తలనొప్పివల్ల రాలేకపోయానని చెప్పండి. శుభం."

అని ప్రకాశం గిరుక్కున వెనక్కు తిరిగాడు. లటాలున అతనిచెయ్యి పట్టుకుని వెనక్కు లాగాడు.

"మీమాటలు నాకేమీ బోధపడలేదు. నేను ఇంటికి వెడుతున్నాను. మీరుకూడా వస్తే రండి మీయిష్టం." అనేసి ముభావంగా ముందుకి నడిచాడు.

ప్రకాశం అతని బుజం తట్టి వూరుకున్నాడు కొంత దూరం నడిచాక అతడు వెనక్కితిరిగి చూశాడు. ప్రకాశం తనతోరావటంలేదు. దూరదూరంగా ఏటివైపువెడుతున్నాడు.

అతనిమాటలు అతనికి బాధకలిగించాయి. ప్రకాశం ఎక్కువగా ఆలోచించే వ్యక్తిగాదు. ఏది తోస్తే అది చేయుటం, ఏమాట అనాలనిపిస్తే ఆమాట అనటం అతని కలవాటు. ఈ విషయం అతను పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. కాని తనని రొంపిలోకి లాగాలని అతను ఎందుకు ప్రయత్నిస్తున్నాడో అర్థం కావటంలేదు. ఆలోచనల్లో సతమతమవుతున్న అతని మనసులో సుహాసిని మెదిలింది. ప్రకాశం ఆమెని గురించి ఏదో అన్నాడు. అందులో నిజమెంతో తెలుసుకోవాలనిపించింది అతనికి. కాని నిజం దాచవలసిన అవసరం ప్రకాశానికి లేదు. తనతో అతను అబద్ధమెందుకు ఆడుతాడు. తను సుహాసినికిచ్చిన చనువేమి ఎక్కువకాదు. ఇందులో అనుమానించడానికి అవకాశంలేదు. ప్రకాశం కావాలని తనమీద మాటలు విసరలేదని నిశ్చయించుకుని తృప్తిపడ్డా డతను.

ప్రకాశం రాత్రి ఎన్ని గంటలకి ఇంటికి వచ్చాడో అతను గమనించలేదు. తెల్లవారిన తరవాత అతనిని చూడాలని కూడా అనిపించలేదు. కాని ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం మాత్రం కలిగింది. అయినా ప్రకాశాన్ని ఈ విషయం గురించి కదిలించలేదు. అతను కూడా రాత్రి ఏమీ జరగలేదన్నట్టుగా ప్రవర్తించాడు.

ఆఫీసు గదిలో ప్రవేశించగానే మామూలుగా సుహాసినే మొదట కనిపించి నమస్కారం చేసింది. ప్రతి నమస్కారం చేస్తూ ఆమెను నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూశాడు. ఆమెలో మార్పేమి కనిపించలేదు. మామూలుగానే నవ్వుతూ

సుతారంగా మెలికలు తిరుగుతూ, ఉల్లాసంగా మాట్లాడుతూ, వాలుగా చూపుల్ని ప్రసరిస్తూ ప్రవర్తించసాగింది. అయినా ఆమెని చూస్తుంటే అతనిలో ఏదో అయిష్టత కలిగింది ఆమె నోట్‌బుక్ చేత్తోపట్టుకుని పెన్సిల్ ఆడిస్తూ మామూలు ఉత్సాహంతోనే అడిగింది.

"ఏమైనా ఉత్తరాలు చెబుతారా సార్?"

"ఏమిలేవు ప్రస్తుతం." అన్నాడు ముక్తసరిగా.

ఆమె అతనిలోని అప్రసన్నత కనిపెట్టింది.

"అలా ఉన్నారేమండీ?" అంది.

"బాగానే ఉన్నాను" అన్నాడు అతను తలెత్తకుండా.

ఆమె కొంచెం తటపటాయించి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోగానే అతను కొంచెం బాధపడ్డాడు. ప్రకాశం అనవసరంగా ఆమెమీద లేనిపోనిఅభాండం వేశాడేమో. తన మీద కోపాన్ని అలా తీర్చుకున్నాడేమో, ఏమైనా తనకెందుకు? ఆమె తన స్టెనో. పనిఉంటే పిలిచి ఉత్తరాలు రాసుకోమంటాడు. లేకపోతే వూరుకుంటాడు. తన కామె జోలి ఎందుకు?

పరధ్యానంగా ఆఫీసు టైమంతా గడిపి అయిదుకాగానే సుహాసిని మేలుకొలుపుతో కుర్చీవదించి లేచాడతను. పరధ్యానంలో కోటు వేసుకోటం మర్చిపోతే అందించి నల్లటికళ్ళతో నవ్వింది.

"ఆఫీసుపనిలో ఇలా సర్వం మర్చిపోయేవాళ్ళకి ప్రేమో

షన్ త్వరలో రాదండీ!" అంది — సుహాసిని అతని మందస్మిత వదనాన్ని గమనించి ధైర్యంగా.

"నాకు ప్రమోషన్ వద్దులెండి" అన్నా డతను వెనుకటి ఉత్సాహాన్ని మళ్ళీ తెచ్చుకుని.

"అదేం మాటండీ? చేరినప్పటినుంచి న్యాయంగా ఉంటూ ప్రమోషన్ కోసం ప్రయత్నిస్తున్నారుగా?" అంది సుహాసిని నవ్వుతూ.

ఆమె ఇంత చొరవ ఎందుకు తీసుకుంటూందో అతనికి అర్థం కాలేదు. పొడిగా విని బయటికి వచ్చేశాడు.

ఇంటికివచ్చి బట్టలు మార్చుకోగానే శ్రీపతి వచ్చాడు. అతని ముఖంలో ఆనందం తాండవించింది.

"భేష్! నిజంగా మీరు చాలా మంచివారు. సేట్ పర్మిట్ మీద సంతకం పెట్టారని తెలిసింది. సేట్ జీ స్వయంగా వచ్చి మీదర్శనం చేసుకుని ఋణం తీర్చుకుంటాడు. మాట తప్పే మనిషి కాదులెండి. చూడండి, అప్పుడు అడ్వాన్సు బాపతు డబ్బు మీరు తిరస్కరించారు. అయినా నేనది సేట్ జీకి ఇంకా వాపస్ ఇవ్వలేదు. నాకు తెలుసు. మీరు చాలా మంచివారు. ఇదిగో, ఇది మీదే. ఇహ నేను వెళుతున్నాను. సేట్ తో మీ రేం పరిష్కారం కుదుర్చుకుంటారో మీ ఇష్టం."

మూర్తి దిగ్భ్రాంతుడైనాడు.

"పర్మిటేమిటి?" అన్నాడు.

"అదే, ఫూల్ చంద్ పర్మిట్."

మూర్తికి ముచ్చెమటలు పోశాయి. తను ఆ రోజంతా పరధ్యానంగా ఫైల్స్ చూచాడు. పొరపాటున సంతకం పెట్టాడు గావును. ఇప్పుడు వాళ్ళ ఆకాగితాలు తెప్పించి రద్దుచేయటం భావ్యంకాదు. ఏంచేసేట్టు: ఆ పర్మిట్ విషయంలో ఏదో పేచీ ఉండి ఉంటుంది. సేఠ్ వూరికే డబ్బెందుకు యిస్తాడు.' అతడు తనని తను శపించుకున్నాడు.

“శ్రీపతిగారు, ఒక్క మేలుచేయండి. ఈ డబ్బు తీసి కెళ్ళి సేఠ్ కి అందచేయండి. అతన్ని నాకు కనిపించవద్దని చెప్పండి.” అన్నాడు.

ముఖంలో భావం ప్రస్ఫుటింపచేయకుండా శ్రీపతి ఆశ్చర్యపోయాడు. ఏదో తికమక జరిగిందనుకున్నాడు. అతని వైఖరి చూస్తే సంభాషణకి తావు కనిపించలేదు. శ్రీపతి మాట్లాడకుండా ముఖం చిన్నపుచ్చుకుని ఆడబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు.

మూర్తిలో అశాంతి ఎక్కువైంది. ఏదో ఇల్లు చూసుకుని అందులోకి బసమార్చాడు. రోజులు గడిచిపోతున్నాయి. రామదాసు అతన్ని గుళ్ళోకి తీసుకు వెళ్ళి ఉపదేశం చెయ్యాలని అప్పుడప్పుడు ప్రయత్నిస్తునేఉన్నాడు. ప్రకాశం తన ధోరణిలో ఉపన్యాసాలు ఇస్తూనే ఉన్నాడు. సుహాసిని తన మామూలువిన్యాసాల్తో చొరవగా మాటలంటూనేఉంది.

* * *

ఆకాశంలో తెల్లటి కాంతికి మూలం వెతుకుతూ తెలి మబ్బులు, దిక్చక్రంపైన పదహారు వన్నెలతో నాటకీయంగా

ప్రత్యక్షమైన చంద్రబింబాన్ని ఆశ్చర్యంగా దగ్గరికివచ్చి చూసి ఆ విషయం ఆకాశమంతా చాటడానికి ప్రయాణిస్తున్నాడు.

చంద్రుడు భూలోక సౌందర్యాన్ని చూడడానికి ఆకాశపు మెట్లెక్క సాగాడు.

వెన్నెల్లో స్నానంచేసి తెల్లగా మెరుస్తున్నాయి మల్లెలూ, విరజాజులూ.

ఏరు సంతోషంలో ఉరకలు వేస్తూ ఉప్పొంగిపోతోంది.

ఏటిగట్టుని నడుస్తున్నాడు. గట్లమీద చెట్లు నవనవలాడుతూ సంతోషంగా వూగిపోతున్నాయి. గాలి ఉత్సాహంగా ఆకాశంలో సుడులు తిరుగుతూ నాట్యం చేస్తూ పుష్ప పరిమళాన్ని చంద్రుడికి నివాళిస్తోంది,

ప్రకృతి సమస్త నవయువ్వనంలో నిండు ఉత్సాహంతో తో నికిసలాడుతోంది.

ప్రకృతిలోని ప్రతి అందము కన్నుల పండుగగా చూస్తూ నడుస్తున్నాడు.

ప్రవాహం వయ్యారంగా మెలికలు తిరుగుతూ పోతోంది.

అలలు లేచి పడుతూ తరగని ఉత్సాహంతో నృత్య భంగిమలతో ముందుకు సాగిపోతున్నాయి.

ఆ యేటి అందం చూస్తుంటే అందులో మునకవేస్తూ ప్రవాహంతో సాగిపోవాలని బలీయమైన వాంఛకలిగింది అతనికి. గట్టుదిగి ఇసుక దిబ్బలమీద నడవ సాగాడు. దూరదూ

రంగా అక్కడక్కడ కొంతమంది తనలాగానే యేటిలో ఆడు
కుంటూ ఆనందిస్తున్నారు.

యేటిమీదికి వంగిన కొబ్బరిచెట్టు మొదల్లో ఎవరో
లీలగా కదిలారు.

ఆ కొబ్బరిచెట్టు వైపుకే నడుస్తున్న అతను అది గమ
నించి పరకాయించి చూశాడు.

చిరుగాలికి తెరచాపలా తెల్లటి చీరకొంగు రెపరెప
లాడుతోంది.

దగ్గరగా వచ్చా డతను. బండలకి తగిలి పడుతూ నుర
గలు కక్కే అలల్ని చూస్తూ మైమరచి ఆమె అతనిని చూడ
లేదు కాని అతను స్పష్టంగా చూసి వెనక్కి ఒక్క అడుగే
శాడు. కాని అడుగెయ్యటంలో పాదం బ్రహ్మజెముడు ఆకు
మీద పడి ముల్లు గుచ్చుకున్నాయి. అతను 'అబ్బ' అని ఆ
ఆకు లాగివేశాడు.

ఆమె ఉలిక్కిపడి లేచి నుంచుంది.

"సుహాసినీ" అన్నాడు.

గబుక్కునతలెత్తి ఆమె అతనినిచూసి విస్మయంతో
"మీరా?" అంది.

"అవును." అన్నా డతను.

"ఇలా వచ్చారేం?" అందామె.

"పౌర్ణమి కదూ?" అన్నాడు అతను. ప్రకాశం మాట
లన్నీ అతని చెవుల్లో మారుమ్రోగాయి.

"పౌర్ణమినాడు నిజంగా ఎంత బావుంటుందండి యేరు!" అంది ఆమె ఆరాధనా పూర్వకంగా.

"నేను రావటం ఇదే మొదటిసారి." అన్నాడు అతను.

"నేను నాలుగైదుసార్లు వచ్చానండి. ప్రతి పౌర్ణమికీ తప్పక వస్తున్నాను."

"అయితే మీరుకూడా కొత్తగానే ఉద్యోగంలో చేరారన్నమాట."

"అవునండి. రెండుమూడు నెలలవుతుంది."

"ఇలా మీలాంటివాళ్ళు ఒంటరిగా రావటం మంచిది కాదేమో." అన్నా డతను.

"నాకెవరూ లేరు, యేంచేయను?" అందామె తల దించుకుని.

"ఒంటరిగా ఇక్కడ కూచుని యేంచేస్తారు?"

"కబుర్లు చెప్పండి వింటాను." అందామె నవ్వి అతని వైపు కళ్ళెప్పగించి చూస్తూ. ఆమె నల్లటికళ్ళవైపుచూచాడు. వాటిలో యేదో ఆకర్షణ అతని మాపుల్ని అరికట్టింది, ఆమె కళ్ళని పక్కకి తిప్పుకుంది.

"మీకళ్ళు బావుంటాయి." అన్నాడు.

ఆమె విషయాన్ని తప్పిస్తూ "యేరు ఎంత బాగుందో చూడండి." అంది.

ప్రకాశం మాటలు జ్ఞప్తికి వచ్చాయి అతనికి.

"యవ్వనంలా" అన్నాడు.

సుహాసిని మాట్లాడలేదు. గాలికి ఆమె ముంగురులు చెదిరి నున్నటి బుగ్గలమీద నాట్యం చేస్తున్నాయి. ఆమె వాటిని పైకి తోసుకుంటుంటే చీర గాలికి పత్రాసు యిస్తోంది.

ముగ్ధుడై అతను ఆమె యవ్వనరేఖా లావణ్యాన్ని చూస్తున్నాడు.

పదహారు వన్నెల చంద్రబింబం వెన్నెలలు కురిపిస్తోంది. ఎక్కడో ఆకాశంలో కాదు. ఇసుకదిబ్బమీద కొబ్బరి చెట్లు మొదట్లో.

"తెల్లటి చీర వెన్నెలలా ఉంది. కాదు, వెన్నెల తెల్ల చీరలావుంది" అన్నాడు తికమకగా.

సుహాసిని ఊరుకుంది. చిన్ననవ్వు ఆమె పెదవులమీద విసిరింది.

నవ్వకండి, చంద్రుడు సిగ్గుపడి దాక్కుంటాడు."

ఇదేంధోరణి అన్నట్టు సుహాసిని అతనివైపు చూసింది ఆ చూపులు తూపులై అతని హృదయంలో గుచ్చుకున్నాయి. ప్రకృతిలో ఎక్కడో వేణువు ఎవరో వూదుతున్నట్టుగా కోకిల తీయగా పాడుతున్నట్టుగా అనుభూతి పొందాడు.

"సుహాసినీ!" అన్నాడు.

"పొద్దుపోతోంది, పదండీ" అందామె.

మూర్తి కదల్లేదు. పొంగిపొంగి పొర్లే ఏరువైపూ, వెన్నెల కురిసే శశిబింబంవైపూ, సుహాసిని అందాలవైపూ చూస్తూ యేదో మధురానుభూతి పొందుతున్నాడు.

ఏరు గట్లుదాటి విచ్చలవిడిగా పొంగి యథేచ్ఛగా విహరిస్తున్నట్టుగా అతని మానసాకాశంలో దృశ్యం కనిపించింది.

సుహాసిని అడుగు ముందుకేసింది. తటాలున ఆమె చెయ్యిపట్టుకుని ఆపాడు. ఆమె అదిరిపడ్డది.

“వదలండీ” అంది భీతితో.

“సుహాసినీ” అన్నాడు కోరికగా.

“వదలండీ” అందామె గాద్గదికంగా.

“ఊహు!”

ఆమె విడిపించుకోసాగింది. ప్రకాశంపాటి చెయ్యానా తను! పెంకెగా, బలంగా ఆమెను దగ్గరికి లాక్కున్నాడు.

చలించే ఆమె అధరాలని చుంబించటానికి తలవంచాడు.

చెంప చెళ్ళుమంది.

మరుక్షణంలో సుహాసిని అతనికి గజం దూరంలో రొప్పుతూ నిలబడ్డది.

“ప్రకాశం మూర్ఖుడు. పశువు రెండు చెంపలూ చెళ్లుమనేదాకా వదల్లేదు. మీరు మంచివారే కాని... కాని... క్షమించండి” అని గాద్గదికంగా, గబగబ అనేసి సుహాసిని గిరుక్కున వెనక్కి తిరిగి చరచర వెళ్ళిపోయింది.

మూర్తి నిశ్చేష్టుడై ఆమె వెళ్ళినవైపే చూడసాగాడు.